క్లుప్తంగా

వృద్ధులకు నిత్యావసరాల వితరణ



అనపర్తిలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసరాలు వితరణ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పెదపూడి: అనపర్తిలోని రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రామిరెడ్డి మంగయమ్మ మహిళా వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక సేవకురాలు దివంగత సీహెచ్ నూకరత్నం మూడో వర్ధంతి సందర్భంగా ఆమె భర్త వీర రాఘవరెడ్డి ఆర్థిక సహకారంతో వీటిని సమకూర్చారు. ఒక్కొక్కరికీ 25 కేజీల బియ్యం, ఇతర ఆహార పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో కర్రి శ్రీనివాసరెడ్డి, జే.శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి ఆదిరెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు, దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ



వంగలపూడి చర్చి వద్ద వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని వంగలపూడి సెయింట్ పాల్ చర్చిలో వృద్ధులకు, దివ్యాంగులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. దేవరపల్లి మండలం గొల్లగూడెంలోని లగడపాటి రామలక్ష్మమ్మ రామానాయుడు దివ్యాంగుల ఆశ్రమం – వృద్ధాశ్రమం, భాస్కర సర్జికల్స్ అండ్ ఆర్టిఫిషియల్ లింబ్స్ సెంటర్ వ్యవస్థాపక చైర్మన్ కాగిత భాస్కరరావు సౌజన్యంతో పాస్టర్ నక్క విజయ్‌కుమార్ (యోబు) ఆధ్వర్యంలో 125 మందికి పంపిణీ చేశారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

వీరుళ్లమ్మ ఉత్సవాలకు రాట ముహూర్తం




అనపర్తిలో గ్రామ దేవత వీరుళ్లమ్మ ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

పెదపూడి: వీరుళ్లమ్మ తీర్థ మహోత్సవాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మ జాతర మహోత్సవాలకు సంబంధించి ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఈ ఉత్సవాలు వచ్చేనెలలో జరిగే సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఐదు రోజుల పాటు జరుగుతాయి. పలు ప్రాంతాలు, ఇతర దేశాల నుంచి వచ్చే భక్తులు వీరుళ్లమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

కుతుకులూరులో..

అనపర్తి మండలం కుతుకులూరు భక్తాంజనేయ స్వామి ఆలయంలో వచ్చే నెలలో జరిగే సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించే ఉత్సవానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పందిరి రాట ముహూర్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆలయాల పండితులు, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయాలి



సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ నాయకుల సమావేశం

సీతానగరం: వచ్చే నెల 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావం జయప్రదం చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గోదావరి విభాగ్ ప్రచారక్ సోమశేఖర్, బీజేపీ జిల్లా నాయకులు ఏపీఆర్ చౌదరి కోరారు. ఆదివారం సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన బీజేపీ సమావేశంలో వారు మాట్లాడుతూ హిందువుల్లో ఐక్యమత్యం లేకపోవడంతో పలు అనర్థాలు జరుగుతున్నాయన్నారు. సమరసతా సేవ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మల్లేశ్వరరావు, బీజేపీ మండల మహిళా అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, మద్దాల కొండలరావు పాల్గొన్నారు.

వడిశలేరులో నేడు రైతు సదస్సు

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు గ్రామంలో సోమవారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించనున్నట్టు నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. స్థానిక కాకతీయ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ సదస్సుకు పలువురు శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. రైతులంతా కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.



కోస్తున్న వరి పంటను యంత్రం



యంత్రం కోసిన పొలంలో ముక్కలైన గడ్డిని కట్టలు కడుతున్న దృశ్యం

పరక దొరికితే పండగే!

- యంత్రాలతో వరి కోతలు
- ఎండు గడ్డికి తీవ్ర కొరత
- పశుగ్రాసం కోసం రైతన్నల అవస్థలు



ట్రాక్టరుపై రవాణా అవుతున్న ఎండుగడ్డి

రాజానగరం: 'పాడి – పంట' విడదీయరాని అనుబంధంతో జనజీవనంలో కలిసిపోయాయి. అయితే వ్యవసాయ రంగంలో ఆధునికత పెరుగుతున్న నేపథ్యంలో సాగుకు పశువులతో అవసరం లేకుండా పోతోంది. పాడి పశువులకు గ్రాసం (ఎండు గడ్డి) దొరకని పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో పాడిరైతులు పశుగ్రాసం కోసం నానా అవస్థలు పడవలసి వస్తోంది. సాధారణంగా వ్యవసాయం చేసే రైతులకు పాడి సంపద కూడా తోడై ఉంటుంది. దుక్కుల నుంచి పంట కోతలు, ధాన్యం రవాణా మున్నగు పనులకు గతంలో పశువులను ఎక్కువగా ఉపయోగించేవారు. అంతేకాకుండా పాల ఉత్పత్తికి కూడా పశువులను పెంచడం పరిపాటిగా ఉండేది. అయితే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో వ్యవసాయంలో పశువుల అవసరం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. అయితే పాల ఉత్పత్తులకు మాత్రం వీటి అవసరం ఉండటం వల్ల చాలామంది రైతులు తమ కమతాలలో పాడి పశువులను పెంచుతూ వస్తున్నారు. అటువంటి వారికి నేడు పశుగ్రాసం కొరత తీవ్రంగా వేధిస్తోంది.

ఎండు గడ్డికి పెరిగిన డిమాండ్

ఆధునిక వ్యవసాయ విధానాలలో భాగంగా నాట్ల నుంచి కోతల వరకు యంత్రాలను ఉపయోగిస్తున్న తరుణంలో పశుగ్రాసంగా ఎక్కువగా ఉపయోగించే ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. పండిన పంటను కూలీల సాయంతో కోత కోసి, ఆ పనలను నూర్పిళ్లు చేయడం ద్వారా ఎండు గడ్డిని పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ విధంగా వచ్చిన ఎండు గడ్డిని మేటులుగా వేసి, తదుపరి పంట వచ్చే వరకు పశువుల పెంపకందారులు ఆ గడ్డిని వాటిని మేతగా వేసేవారు. మధ్యలో ఇతర దాణాలు ఉన్నా ఎండు గడ్డినే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అయితే వరి పంట కోతలలో 90 శాతం పైబడి యంత్రాలను ఉపయోగిస్తుండటంతో ఎండుగడ్డి దొరకడం లేదు. యంత్రాలతో పంటను కోసే సమయంలో గడ్డి పరకలు ముక్కలు ముక్కలుగా తునాతునకలవడంతో వాటిని పొలంలోనే వదిలేస్తున్నారు. దీంతో ఎండు గడ్డికి కొరత ఏర్పడుతోంది. **ఎక్కడైనా కూలీల ద్వారా కోతలు జరిగాయని తెలిస్తే చాలు ఎండు గడ్డి అవసరమైన వారు ఆయా ప్రాంతాలకు వెళ్లి, అధిక ధరలు చెల్లించి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గడ్డి పరక కూడా నేడు ఉచితంగా దొరకడం లేదు.**

ఎండు గడ్డికి ప్రత్యామ్నాయం లేదు

ఎండు గడ్డికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో నిన్నటి వరకు పనికిరాదని పొలాల్లో వదిలేసిన ముక్కలైన గడ్డికి కూడా నేడు డిమాండ్ పెరుగుతోంది. యంత్రాలతో కోతలు అయిన తరువాత ముక్కలుగా పడివున్న గడ్డిని పోగులు చేసి, కట్టలు కట్టి విక్రయిస్తున్నారు. ఒక్కో కట్ట రూ.35 నుంచి రూ.50 రేటు ఉంటే దానిని రవాణా చేసేందుకు మరో రూ.35 చెల్లించవలసి వస్తోంది. అంటే ఒక కట్ట గడ్డికి కొనుగోలుదారు రూ.70 పైనే భారాన్ని భరించకతప్పడం లేదు. ఇక అసలైన ఎండు గడ్డి దొరికిందంటే పండగే అని చెప్పాలి. ట్రాక్టరు గడ్డి గతంలో రూ.ఐదువేలు లేదా రూ.ఆరు వేలకు దొరికేది, కానీ నేడు అది రూ.13 వేలు పైగానే పలుకుతోంది.

కొరతను నివారించాలి

కూలీల సమస్యలతోను, సమయాభావం వలన రైతులు సాగుకు యంత్రాలను వినియోగిస్తున్నారు. ఈ కారణంగా పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. ముఖ్యంగా రోజువారీ పశువుల పెంపకంలో ఒక్క పశువుకు ఆరు కిలోల వరకు ఎండు గడ్డిని, 8 కిలోల వరకు పచ్చిరొట్టను వేస్తారు. పచ్చిరొట్ట దొరకకపోతే ఆ లోటును ఎండుగడ్డి ద్వారానే తీర్చవలసి వస్తుంటుంది. ఇటువంటి పరిస్థితులలో ఎండు గడ్డి లేకపోతే కష్టం. ఈ కొరతను నివారించాలి.

– నీలపాల సుబ్రహ్మణ్యం, రైతు, రాజానగరం

ట్రాక్టరు గడ్డికి రూ.15 వేలు అయింది

ప్రస్తుతం ఎండుగడ్డి దొరకడం గగనమై పోతోంది. ఎక్కడైనా ఉంది అంటే చాలు పశువుల పెంపకందారులు పరుగులు పెడుతున్నారు. దీంతో అమ్మేవారు ధరను పెంచేస్తున్నారు. చివరకు యంత్రాలతో కోతలు కోసిన చోట ముక్కలైన గడ్డి కూడా ప్రస్తుతం దొరకడం లేదు. వారం రోజుల క్రితమే ట్రాక్టరు ఎండుగడ్డిని రూ.15 వేలు ఇచ్చి కొనవలసి వచ్చింది.

– సత్తి త్రిమూర్తులు, రైతు, ఆలమూరు

విధులకు ఆటంకం కలిగించాడని ఫిర్యాదు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన పెనుగుల లక్ష్మణరావు తన విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని నల్గొండ వీఆర్ఏ బాదంపూడి మునలయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ముగ్గళ్ల ర్యాంపులో అక్రమ ఇసుక రవాణా జరగకుండా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు డ్యూటీలు వేశారని తెలిపారు. తను డ్యూటీలో ఉండగా పెనుగుల లక్ష్మణరావు దౌర్జన్యంగా వెళ్లి ట్రాక్టరుపై ఇసుకను లోడు చేసుకుని వస్తుండగా తాను ఆపానని తెలిపారు. అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా వాగ్వాదానికి దిగాడని వివరించారు. ఆపడానికి నువ్వెవరు, ఇక్కడ పనేంటి అంటు తనను గెంటివేయగా కిందపడిపోయానని, దౌర్జన్యంగా ట్రాక్టర్‌ను తీసుకువెళ్లాడని వీఆర్ఏ మునలయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత ఆదిత్యునికి ఆదివారం ఆలయంలో పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



కొమరిపాలెంలో ఇందిరా గాంధీ విగ్రహంపై తొలగించని ముసుగు



తొస్సిపూడిలో ముసుగు వేసిన మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం

తొలగింపునకు తీరిక లేదా..?

- నాయకుల విగ్రహాలపై తొలగని ముసుగులు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు పూర్తి

బిక్కవోలు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు కావస్తున్నా ఇంకా నాయకులపై వేసిన ముసుగులు తొలగలేదు. మండలంలోని కొమరిపాలెం గ్రామంలోని మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, తొస్సిపూడిలోని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీల విగ్రహాలతో పాటు ఈ రెండు గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలపై వేసిన ముసుగులను సైతం తొలగించలేదు. కోడ్ వ్యవధి పూర్తయిన తర్వాత ఒకటి రెండు రోజుల్లో తొలగించాల్సి ఉన్నా పది రోజులు పూర్తయినా విగ్రహాలకు ముసుగు తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

జాతీయ గణిత దినోత్సవం



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, అధ్యాపకులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో జాతీయ గణిత దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కె.నవీన్‌కుమార్ మాట్లాడుతూ మన భారత దేశానికే కాక ప్రపంచానికే గణిత విభాగంలో తనదైన ముద్ర వేసిన శ్రీనివాస్ రామానుజన్ జాతికి చేసిన సేవను గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో గణితం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ ఎం.సుధామయి, డాక్టర్ డీవీ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, ఎస్డీ మదీన, వీవీ సుబ్బారావు, ఎ.వాణి, ఎస్.మీనాక్షి, కుమారి, అలేఖ్య, ఎ.వెంకటేష్, కె.దుర్గాప్రసాద్, వై.ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా శనగ సాగు



చంద్రేడు గ్రామంలోని నల్లరేగడి నేలలో మొలకెత్తిన శనగ చేను

రంగంపేట: మండలంలోని నల్లరేగడి నేలల్లో వేసిన శనగ పంట ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో మొక్కలు కళకళలాడుతున్నాయి. కొద్ది రోజులుగా మంచు, చలిగాలులే కాకుండా తుఎపాను ప్రభావంతో చిరు జల్లులు పడుతుండడంతో ఆ వాతావరణం మొక్కల ఎదుగుదలకు కలిసొచ్చింది. సాధారణంగా శనగ పంటకు ఒకటి, రెండు నీటితడులుంటే సరిపోతుంది. మంచు కారణంగా మొక్కలు ఎదుగుతాయి. మండలంలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లోని నల్లరేగడి నేలలో రైతులు ఖరీఫ్‌లో వరి, మినుము పంటలు సాగు చేశారు. ఆ పంటలు ఒబ్బిడి అనంతరం రబీలో శనగ సాగు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 25 శాతం రాయితీపై 63 టన్నుల శనగ విత్తనాలు పంపిణీ చేయడంతో 800 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. విత్తనాలు వేసి పది పదిహేను రోజులు గడుస్తుండడంతో మొక్కలు బాగా మొలకెత్తాయి. 90 రోజుల్లో చేతికి వచ్చే ఈ పంట ఎకరానికి ఎనిమిది బస్తాల పైన దిగుబడి వస్తే మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టినట్టు తెలిపారు.

కోరుకొండ నరసన్న సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు



కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

మధురపూడి: కోరుకొండలో వేంచేసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామివారికి ఉదయం మాఢవీధుల గుండా పల్లకీపై గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయంలో స్వామివారు ప్రత్యేక పూజలందుకున్నారు. ఈ నెల 15వ తేదీన ఆలయ చైర్మన్ పరాసర రంగరాజు భట్టర్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక మెయిన్‌రోడ్డులోని ఆర్యవైశ్య రామాలయం, బస్‌స్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

వాసవీ ఇంటర్నేషనల్‌కి 111 అవార్డులు

సీటీఆర్ఐ: వాసవీ క్లబ్‌లు విస్తృత సేవలు అందిస్తున్నాయని, వాసవీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 215ఏ కి ఈ ఏడాది చేసిన సేవలను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో డిస్ట్రిక్ట్ కి 111అవార్డులు లభించాయని డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్ళకూరి కెవిపిఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. లాలాచెరువు రోడ్డులోని వైశ్యా హాస్టల్‌లో ఆదివారం సాయంత్రం వాసవీ క్లబ్స్ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వాసవీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ కె.రవిచంద్రన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ ఏడాది పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. తమ సేవలను గుర్తించిన వాసవీ ఇంటర్నేషనల్ 111 అవార్డులు ప్రకటించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 2025కి ఇంటర్నేషనల్ సెక్రటరీగా బోడా సాయిసూర్య ప్రకాష్ నియమితులవ్వడం ఆనందంగా ఉందన్నారు. సాయి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో 111 అవార్డులు రావడం ఇదే తొలిసారి అన్నారు. డిస్ట్రిక్ట్ లెవల్ లో కూడా అవార్డులు అందజేయడం ఆనందదాయకమన్నారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాశీ విశ్వేశ్వరరావు, మానేపల్లి రమేష్, డిస్ట్రిక్ట్ కేబినెట్ సెక్రటరీ సురేష్, వైస్ గవర్నర్ రాఘవకుమారి, రాణి, హశాంత్, రీజనల్ చైర్మన్లు చంద్రగుప్త, సుదీర్, పలువురు వాసవీయన్లు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ జాతర



మధురపూడిలో కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడిలో ఆదివారం శ్రీ కనకదుర్గమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానికుల సహకారంతో జాతర మహోత్సవాలు జరిగాయి. కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం మండలాలకు చెందిన గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చారు. ఉదయం నుంచి భక్తులు మొక్కులు తీర్చుకోవడంతో మధురపూడిలో రద్దీ ఏర్పడింది. విశేష అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకస్వాములు అమ్మవారికి ఉదయం విశేష పూజలు నిర్వహించారు. కుంకుమపూజలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీసీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాణసంచా కాల్పులు చూపరులను ఆకట్టుకున్నాయి.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



జి.మామిడాడలోని కోదండ రామాలయంలో కూచిపూడి కళాకారులతో మాజీ ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: కోదండరాముని సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్విరామంగా చేపట్టడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన కోదండ రామచంద్ర మూర్తి ఆలయంలో ఆలయ ధర్మకర్త ద్వారంపూడి శ్రీరామ మురళీకృష్ణ శ్రీనివాసారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 12 గంటల పాటు నిర్విరామంగా నృత్య నీరాజన కూచిపూడి ప్రదర్శన చేశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు హాజరయ్యారు. కూచిపూడి కళాకారులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆలయ ధర్మకర్త శ్రీనివాసారెడ్డి, ఇతర ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. ఈ ప్రదర్శనలో వంద మంది కూచిపూడి కళాకారులు పాల్గొని అలరించారు. భక్తులు నృత్య ప్రదర్శనను తిలకించి ఆనంద పారవశ్యం పొందారు. తదనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

హృద్యంగా నృత్యోత్సవాలు



నవ జనార్దన పారిజాతం నృత్య రూపకం



రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జరుగుతున్న కళాప్రియ నృత్య కళాక్షేత్రం సంగీత నృత్యోత్సవాలు రెండో రోజు ఆదివారం హృద్యంగా సాగాయి. నాట్యాచార్యుడు ఆచంట చంద్రశేఖర ఆధ్వర్యంలో నవ జనార్దన పారిజాతం నృత్య రూపకం కళాకారులు ప్రదర్శించారు. అనంతరం నాట్య గురువులను అవార్డులతో సన్మానించారు.

– సాక్షి, రాజమహేంద్రవరం

డ్రోన్ వినియోగంపై పోలీసులకు శిక్షణ



అనపర్తిలో పోలీసులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనునాయక్

పెదపూడి: జాతరలు, యాత్రల సమయాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకునే సందర్భాల్లో డ్రోన్ కెమేరాలు విశేషంగా ఉపయోగపడతాయని అనపర్తి ఎస్సై శ్రీనునాయక్ అన్నారు. అనపర్తిలో పోలీసులకు డ్రోన్ కెమెరా వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. భారీ ఎత్తున నిర్వహించే ర్యాలీలు, ధర్నాలను డ్రోన్ సహాయంతో పర్యవేక్షించవచ్చునని వివరించారు.